క్లుప్తంగా

కార్మిక, కర్షక హక్కుల కోసం పోరాడుదాం..

ఇల్లెందు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ శక్తులకు లోబడి రైతు, కార్మిక, కర్షక వర్గాలకు వ్యతిరేకంగా అనేక చట్టాలు తెచ్చి వారిని ఇబ్బందులకు గురి చేస్తోందని సీపీఎం అనుబంధ కార్మిక సంఘాల నేతలు రేపాకుల శ్రీనివాస్, ఎస్‌ఏ నబీ అన్నారు. ఆదివారం ఇల్లెందులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

'ఆరోగ్యమిత్ర'లకు ఉద్యోగ భద్రత కల్పించాలి


మాట్లాడుతున్న చిరుముప్ప

పాల్వంచరూరల్: జిల్లాలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలు తక్కువ వేతనాలతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే వేతనాలు పెంచాలని ఆరోగ్యశ్రీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మడకం చిరుముప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆదివారం జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యమిత్రలను స్కిల్డ్ ఎంప్లాయిస్‌గా గుర్తించాలని, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. ఆరోగ్యశ్రీ ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ సెలవు దినాలను వర్తింపజేయాలని, విధి నిర్వహణలో మృతి చెందిన ఆరోగ్యమిత్ర కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కృష్ణ, ఉపాధ్యక్షుడు ప్రదీప్, కోశాధికారి ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న రాజ్యం రావాలి..

పాల్వంచరూరల్: బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపాలంటే వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిలక్కతోనే సాధ్యమని కొత్తగూడెం నియోజకవర్గం ఇన్‌చార్జ్ షేక్ ఖలీల్‌పాషా అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని శివనగర్, వికలాంగుల కాలనీలో ఆదివారం పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడారు. ఇతర పార్టీల నుంచి 80మంది కాలనీ వాసులు వైఎస్సార్ టీపీలో చేరినట్లు తెలిపారు. రాజన్న సంక్షేమ పాలన షర్మిలక్కతోనే సాధ్యమన్నారు. గతంలో ఆదివాసీలకు నిరుపేదలకు దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు పోడు పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని, నిరుపేదలకు ఆరోగ్యశ్రీ, వృద్ధులకు, వితంతువులకు పెన్షన్ ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కమిటీ సభ్యులు భూక్యా తేజానాయక్, జిల్లా యూత్ అధ్యక్షుడు గంగుల సాయిరెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు బండి నాగరాజు, పాల్వంచ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అమీర్, ఎస్సీ సెల్ యూత్ అధ్యక్షుడు ప్రవీణ్, నాగరాజు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

పాల్వంచరూరల్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక జీవితంపై విరక్తి చెంది ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకుని కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక పట్టణ పరిధి పాతపాల్వంచలోని రామానందతీర్థ కాలనీలో నివాసం ఉంటూ కూలి పనులు చెసుకుంటూ జీవనం సాగిస్తున్న పెరుమాళ్ల రమేష్ (31) ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ మూడు రోజుల క్రితం ఇంట్లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఈ ప్రమాదంలో శరీరం తీవ్రంగా కాలింది. గమనించిన స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి వదిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్‌ఐ నరేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చేపల దొంగలపై చర్యలు తీసుకోండి

పాల్వంచరూరల్: చెరువులో పోసి పెంచుతున్న చేపలను దొంగతనంగా పట్టుకుంటున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సమ్మక్క సారక్క సొసైటీ అధ్యక్షుడు కాక రమేష్, శేఖర్, సత్యాలు ఆదివారం విలేకరులతో తమ గోడు వెళ్లబోసుకున్నారు. మండల పరిధిలోని దంతలబోరు గ్రామపంచాయతీలోని బస్వరాయి చెరువులో గంగాదేవిగుప్పా గ్రామానికి చెందిన సమ్మక్క సారక్క చేపల సొసైటీ సభ్యులు, గిరిజనులు చెరువులో చేప పిల్లలను పోసి పెంచుతుండగా గిరిజనేతరులు దొంగతనంగా పట్టుకుని చేపలు పట్టుకుని నష్ట పరుస్తున్నారని వాపోయారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఈనెల 12వ తేదీన రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పోలీసు ఉన్నాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పంచాయతీకి పట్టదు.. ఆర్టీసీకి గిట్టదు

- నాలుగు ఊళ్లకు ప్రధాన కూడలి
- సౌకర్యాలు లేక ప్రయాణికుల ఇక్కట్లు
- బస్‌షెల్టర్, మరుగుదొడ్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతి


ఇల్లందు క్రాస్‌రోడ్డులోని ప్రధాన కూడలి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రధాన ఊళ్లకు కూడలి అది. ఇక్కడ నిత్యం వందల మంది ప్రయాణికులు వేచిఉండు స్థలం. వారి ఊళ్లకు చేరుకోవడానికి ఆర్టీసీ బస్సులు, ఆటోల కొరకు వేచి ఉంటారు. ప్రయాణికులు ఎండ, వాన, చలి.. ఇలా ఏడాదంతా బస్సులు, ఇతర వాహనాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ప్రధాన కూడలి ఇల్లందు క్రాస్ రోడ్డులో. ఇక్కడ నుంచి కొత్తగూడెం, ఇల్లందు, పాల్వంచ, భద్రాచలం ప్రాంతాలకు ప్రయాణికులు నిత్యం వచ్చిపోతుంటారు. ఈ ప్రధాన కూడలిలో చిన్న ఆర్టీసీ బస్సు షెల్టర్ మాత్రమే ఉంది. ఎక్కువ మంది ప్రయాణికులు కూర్చోడానికి అనుకూలంగా లేదు. ఆరుగురు ప్రయాణికులు ఆ షెల్టర్‌లో కూర్చుంటే మిగతావారు ఎండ, వాన, చలిలో ఉండాల్సిన పరిస్థితి. ఈ సెంటర్‌లో ప్రయాణికులు వేచి ఉండేందుకు షెల్టర్లు నిర్మించాల్సిన అవసరముంది. ఆ దిశగా లక్ష్మీదేవిపల్లి మండల, పంచాయతీ అధికారులు గానీ, ఆర్టీసీ అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం శ్రీరామనవమి పండుగ సందర్భం కాబట్టి ప్రయాణికుల రద్దీ కూడా ఎక్కువగా ఉంటుంది. ఇతర ప్రాంతాల నుంచి భద్రాచలానికి ఎక్కువ సంఖ్యలో ప్రయాణికులు వెళ్తుంటారు. వారి సౌకర్యం కొరకు ఇల్లందు క్రాస్ రోడ్డులోని కూడలిలో షెల్టర్లు ఏర్పాటు అనివార్యం. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నా.

షెల్టర్స్, టాయిలెట్స్ లేవు..

లక్ష్మీదేవిపల్లి మండలం ఇల్లందు క్రాస్ రోడ్డు నుంచి ప్రతిరోజు వందల మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. అయితే బస్సులు, ఆటోల కోసం కొంత సమయం ఇక్కడ ప్రయాణికులు వేచి ఉండాల్సి వస్తుంది. ఈ క్రమంలో షెల్టర్లు, టాయిలెట్స్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రస్తుతం ఆ కూడలి మీదుగానే నూతన కలెక్టరేట్‌కు కూడా ప్రజలు వచ్చిపోతున్నారు. దీంతో పాటుగా ప్రస్తుతం ఎండాకాలం చలివేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. టాయిలెట్స్, షెల్టర్లు, చలివేంద్రాల ఏర్పాటుకు పంచాయతీ, ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.


ఇరుకుగా ఉన్న బస్సు షెల్టర్

షెల్టర్లు నిర్మించాలి



ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద నాలుగు ప్రాంతాలకు వెళ్లేందుకు ఉన్న ప్రధాన సెంటర్‌లో ప్రయాణికుల సౌకర్యం కోసం షెల్టర్లు ఏర్పాటు చేయాలి. ఇక్కడ ఒకటే చిన్న షెల్టర్ ఉంది. అందులో ఎక్కువ మంది పట్టరు. ఈ సెంటర్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి. – మాణిక్యమ్మ, ప్రయాణికులు

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి



ఇల్లందు క్రాస్ రోడ్డులో మండల అధికారులు గానీ, స్వచ్ఛంద సంస్థలు కానీ చలివేంద్రం ఏర్పాటు చేయాలి. క్రాస్ రోడ్డులో మంచినీటి సౌకర్యం లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని వెంటనే ఏర్పాటు చేయాలి. – కె.సుబ్బారావు, చిరువ్యాపారి

ఇఫ్టూ రాష్ట్ర మహాసభలకు తరలిరండి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: కార్మిక హక్కుల సాధన కోసం శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరంతరం చిత్తశుద్ధితో పోరాడుతున్న భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని, తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలు లింగయ్య, కొండపల్లి శ్రీనివాస్ కోరారు. ఆదివారం ఇల్లెందులో మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఏప్రిల్ 2న కొత్తగూడెంలో జరగనున్న మహాప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభలో ఇఫ్టూ జాతీయ అధ్యక్షుడు సాధినేని వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, పశ్చిమ బెంగాల్ నాయకుడు అమితాబ్, రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ, ఎం.శ్రీనివాస్, అనురాధ, ఎండీ రాసుద్దీన్ పాల్గొంటారని తెలిపారు. రాజు, మహేందర్, సాయి, ఐలయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠకు భూమి పూజ


పూజలో పాల్గొన్న స్థానికులు

ఇల్లెందురూరల్: మండలంలోని ధనియాలపాడు గ్రామపంచాయతీ ధనియాలపాడు, సేవ్యాతండా, బాలాజీ తండా గ్రామాలలో నాభిశిల ప్రతిష్ఠకు ఆదివారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు. ఈనెల 29న మూడు గ్రామాలలో నాభిశిల ప్రతిష్ఠించేందుకు ముందస్తు పనులు నిర్వహిస్తున్నారు. సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్‌నాయక్, గ్రామపంచాయతీ సర్పంచ్ తిరుపతి ఆయా గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేపు సంత వేలంపాట

టేకులపల్లి: ఈనెల 28న ఉదయం 11 గంటలకు గోలియా తండా పంచాయతీ కార్యాలయంలో టేకులపల్లి, గోలియాతండా పంచాయతీల సంయుక్త శ్రీకోదండ రామాలయం వారంతపు సంత వేలంపాట నిర్వహిస్తున్నట్లు రెండు పంచాయతీల కార్యదర్శులు ఎల్.కిరణ్, రంజిత్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంత కాలపరిమితి ఒక సంవత్సరం ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు 28వ తేదీ ఉదయం 10.30 గంటల లోపు రూ.50వేలు డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు. పాట పాడుకున్నవారు పంచాయతీ నిర్ణయం మేరకు మొత్తం నగదును అదే రోజు సాయంత్రం 5 గంటల లోపు చెల్లించాలని తెలిపారు.

కాంగ్రెస్ సభకు తరలిన పార్టీ శ్రేణులు


కొత్తగూడెంరూరల్: వైరా బహిరంగ సభకు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు


జూలూరుపాడు: ర్యాలీగా వెళ్తున్న నేతలు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం నియోజకవర్గం టీపీసీసీ జనరల్ కార్యదర్శి ఎడవల్లి కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం వైరా బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు 70 వాహనాల్లో భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి మల్లికార్జున్, లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షులు సకినాల వెంకటేశ్వరరావు, పాల్వంచ పట్టణ బీసీసెల్ అధ్యక్షుడు చారి, లక్ష్మీదేవిపల్లి ఎస్సీసెల్ అధ్యక్షుడు కొప్పుల రమేష్, ఐఎన్‌టీయూసీ నాయకులు జలీల్, సుబ్బారెడ్డి, పైడిపల్లి మనోహర్, రాములునాయక్, చంద్రగిరి, సత్యనారాయణ, బొజ్జ వెంకటస్వామి, కె.సత్యనారాయణ, దామోదర్, రమేష్, గణేష్, శ్రీనివాస్, నారాయణ, మొద్దు శ్రీనివాస్, రాజు, కుమార్ ఉన్నారు.

జూలూరుపాడు: రాహుల్ గాంధీ చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రకు కొనసాగింపుగా మాజీ కేంద్ర మంత్రి రేణుక చౌదరి ఆధ్వర్యంలో వైరాలో జరిగిన బహిరంగ సభకు జూలూరుపాడు నుంచి కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం భారీగా తరలివెళ్లారు. మండల కేంద్రం జూలూరుపాడు నుంచి ఆటోల ప్రదర్శనతో ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాలోత్ మంగీలాల్ నాయక్, నున్న కృష్ణయ్య, ధరావత్ రాంబాబు, ప్రియాంక, వాంకుడోత్ కిషన్ నాయక్, గుగులోతు శ్రీనివాసరావు, కొలిపాక వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు రాధాకృష్ణ, ప్రసాద్, బానోతు మంగు నాయక్ ఉన్నారు.

సింగరేణి ఆస్పత్రిలో మందుల కొరత

- డాక్టర్లు రాసిన మందుల లేక ఇతర మందుల పంపిణీ
- సతమతమవుతున్న కార్మిక కుటుంబాలు
- ఉన్నాతాధికారులు స్పందించాలని విన్నపం


సింగరేణి ప్రధానాస్పత్రి ముఖద్వారం


సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణకు కొంగుబంగారంగా విరాజిల్లుతున్న సింగరేణి ప్రధానాస్పత్రిలో మందుల కొరత ఏర్పడింది. మూడు నెలలుగా బీపీ, షుగర్, గుండె, కిడ్నీ, పక్షవాతానికి సంబంధించి కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ప్రాణాలను కాపాడే మందులు, సాధారణ మందులు, విటమిన్ టాబ్లెట్ల కొరత వలన కార్మికులు, రిటైర్డ్ కార్మికులు, కార్మిక కుటుంబాలు ఆస్పత్రిలో అందుబాటులో లేక, ప్రైవేటు మందుల షాపులను ఆశ్రయిస్తున్నారు. ఈ విషయం ఆస్పత్రి ప్రధానాధికారులకు, కార్పొరేట్ ఉన్నతాధికారులకు, వెల్ఫేర్ విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

అంతేకాకుండా దీర్ఘకాలిక వ్యాధులతో కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందుతున్న కార్మిక కుటుంబాల వారు చికిత్స అనంతరం వారు రాసిన మందులకు బదులు ఇతర (వేరే కంపెనీ) మందులు ఇస్తున్నారు. దీంతో జబ్బు తగ్గకపోగా సైడ్ ఎఫెక్ట్స్ వస్తున్నాయని కార్మికులు వాపోతున్నారు. సింగరేణి సంస్థ.. ఉన్న ఆస్పత్రిలోనే మందులు ఇవ్వలేకపోతోందని, మరి దీనిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని చేస్తే మందులు ఎలా సరఫా చేస్తారని కార్మికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆస్పత్రి విషయంలో సంస్థ ఉన్నాతాధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని బాధిత కార్మికులు వాపోతున్నారు.

ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల సంక్షేమంపై ఏది..?


ప్రకృతికి విరుద్ధంగా వందల అడుగుల లోతుల్లో చెమట చిందించి మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తున్నా కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఏటా కార్మికుల సంక్షేమం కోసం ఒక్కో కార్మికుడికి సుమారు రూ.3 లక్షలు ఖర్చు చేస్తున్నామని, కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నామని, కార్మికుల ఆరోగ్యమే సింగరేణి సంస్థ లక్ష్యమని చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దపెద్ద ప్రకటనలు ఇస్తున్నారు కానీ ఆచరణలో శూన్యమని కార్మికుల కుటుంబాలను ఆరోపిస్తున్నారు.

నాణ్యమైన మందులు ఇవ్వాలి



సింగరేణి సంస్థ ఆస్పత్రుల నిర్వహణకై 2021–22లో రూ.145 కోట్లు కేటాయించింది. ఫార్మా కంపెనీలతో మాట్లాడి నాణ్యమైన అన్ని మందులు తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ టెండర్లు పేరుతో నాసిరకం మందులు కొనుగోలు చేశారు. దీంతో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారు. యాజమాన్యం ఈ విధానానికి స్వస్తి పలకాలి.
– వంగా వెంకట్, ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ

అధికారులు సందర్శించాలి



సింగరేణి ఆస్పత్రిలో అధికారుల పనితీరు, యంత్రాల వినియోగం, ల్యాబ్ తదితర అంశాలపై ఉన్నాధికారులు పర్యవేక్షించాలి. 2014 వరకు నెలలో ఒకసారి ఆకస్మికంగా తనిఖీ చేసి లోటుపాట్లను సరిచేసేవారు. ఇప్పుడది పూర్తిగా మారిపోయింది. అధికారులు కార్పొరేట్ ఆఫీసుకు వచ్చేది వారంలో ఒక్కరోజే. ఆరోజు అధికారులతో చర్చించడమే సరిపోతుంది.
– మొగిలిపాక రవి, బీఎంఎస్ ఉపాధ్యక్షుడు

మనసు విప్పి మాట్లాడుకుందాం..


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా

పాల్వంచరూరల్: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను గడపగడపకు తీసుకెళ్లడమే ధ్యేయమని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పాండురంగాపురం గ్రామంలో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ.. పాండురంగాపురం, రెడ్డిగూడెం, యానంబైల్ తదితర ఏజెన్సీ పరిధిలోని గ్రామాల్లోని రైతుల భూములకు హక్కులు కల్పించాలని కోరారు. అదేవిధంగా నర్సంపేట నుంచి రాజీవ్‌నగర్, ప్రభాత్‌నగర్, పునుకుల గ్రామాలకు సీసీ రోడ్లు మంజూరు చేయాలని, పింఛన్లు అందజేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే వనమా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు అనేక సంక్షేమ, అభివృద్ధి పనులు చేపట్టిందని వీటిని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. దేశ రాజకీయాల్లో బీఆర్‌ఎస్ రాబోయే రోజుల్లో ప్రబల శక్తిగా ఎదుగుతుందన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్ తర్వాత కొత్తగూడెం నియోజకవర్గంలో 25 కిలోమీటర్ల సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మనస్సు విప్పి మాట్లాడుకునేందుకే పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో 20చోట్ల ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షుడు పూసల విశ్వనాథం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, వనమా రాఘవేందర్‌రావు, జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, ఎంపీపీ మడివి సరస్వతి, వైస్ ఎంపీపీ మార్గం గురవయ్య, పెద్దమ్మతల్లి గుడి చైర్మన్ మహిపతి రామలింగం, సొసైటీ వైస్‌చైర్మన్ కాంపెల్లి కనకేష్, కొత్తగూడెం మార్కెట్ చైర్మన్ భుక్యా రాంబాబు, ఎంపీటీసీ రవి, పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ డైరెక్టర్లు ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మల్లెల శ్రీరామ్మూర్తి, సర్పంచ్‌లు జగదీష్, కొమరం రాణి, జీవన్‌రెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజానికి కృషి చేద్దాం..


కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీఎస్పీ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: అవినీతి రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. దేశంలో అవినీతి పేరుకుపోయిందని, దాన్ని అంతమొందిచాలన్నారు. అక్రమార్కులు అడ్డదారిలో సంపాదించిన సొమ్ముతో రాజకీయాల్లోకి వచ్చి వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలకు ఆరు నెలల ముందే డబ్బు సంచులతో ఊళ్లల్లో మకాం వేసి ఓట్లను కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. బ్యూరోక్రాట్, కార్పొరేట్ వ్యవస్థ ముసుగులో అక్రమ సంపాదనే పెట్టుబడిగా పెట్టి రాజకీయ వ్యభిచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఈ ప్రయత్నాలను తిప్పి కొట్టాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సమస్యలపై అవగాహన ఉన్న వారిని ముఖ్యంగా యువతను వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే కొత్తగూడెం అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడుతున్న వారికి, స్థానికంగా ఉండే వారికి మాత్రమే అవకాశం ఇవ్వాలని కోరారు.

కార్యక్రమంలో సాయి, చెనిగారపు నిరంజన్‌కుమార్, సందేల సందీప్, తాటిపాముల హరికృష్ణ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారులకు అనుకూలంగా కేంద్రం


మాట్లాడుతున్న భూపాల్

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక లేబర్ కోడ్, విద్యుత్ సవరణ చట్టం, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం కొత్త గూడెంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎనిమిది సంవత్సరాలుగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా రెడ్ కార్పెట్ వేసి దేశ సంపదను దోచి పెట్టేందుకు 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చారని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలకు మోదీ ప్రభుత్వం వేగం పెంచిందన్నారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పథకం చాలా రక్షణగా ఉంటే కేవలం రూ.65 వేల కోట్లు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించారన్నారు. రైతులకు అండగా ఉంటామని, మద్దతు ధర ఇస్తామని చెప్పిన మోదీ రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం దేశ సంపదను అదానికి దోచిపెడుతూ ప్రశ్నించిన వారిని దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. ఈ విధానాలను ప్రశ్నిస్తూ, ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అమరుల పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం


కొమురయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఐ నేతలు

ఇల్లెందు: సీపీఐ నాయకుడు, మాజీ ఎంపీ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, గీత పనివారల సంఘం వ్యవస్థాపకుడు అమరజీవి బొమ్మగాని ధర్మభిక్షం, నమ్మిన సిద్ధాంతం కోసం కమ్యూనిస్టు జెండాను వదలకుండా తుదివరకు ఆదర్శంగా నిలిచిన జక్కుల కొమురయ్య పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు మిర్యాల రంగయ్య అన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో వారి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి సేవలను, పోరాట స్ఫూర్తిని కొనియాడారు. కార్యక్రమంలో కె.శంకర్, డి.శంకర్, బంధం నాగయ్య, కౌన్సిలర్ రవీందర్, దాసరి రాజారామ్, నజీర్ అహ్మద్, శంషుద్దీన్, సత్యనారాయణ, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరసనగా కబడ్డీ, వాలీబాల్ పోటీలు!

టేకులపల్లి: బోడు, కొమరారంలను మండలాలుగా ప్రకటించాలని, ఇల్లెందును రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దశలవారీ ఆందోళన, నిరసన కార్యక్రమాల్లో భాగంగా వినూత్నంగా కబడ్డీ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నేత ఎట్టి నరసింహారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇల్లెందు, గుండాల, టేకులపల్లి, ఆళ్లపల్లి మండలాల స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొని సత్తా చాటాలని కోరారు. ఈ నెల 29, 30 తేదీల్లో బోడు గ్రామంలో పురుషులకు వాలీబాల్, ఏప్రిల్ 1న కొమరారంలో మహిళలకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రథమ రూ.5016, ద్వితీయ రూ.2016 నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలకు ఎంట్రీ ఫీజు లేదని వివరాలకు 8463979879, 8008136988 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

టేకులపల్లి మండలం బొమ్మనపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. పాన్నోజు జగదీశ్వరాచారి ఇంటి సమీపంలో గతంలో ఓ విద్యుత్ స్తంభం ఉండేది. పక్కనే ఓ పెద్ద వేప చెట్టు. దీనిని తొలగించే క్రమంలో ఆ చెట్టు విద్యుత్ స్తంభంపై పడి స్తంభం విరిగిపోయింది. దీంతో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. గాలులకు మంటలు కూడా వస్తున్నాయి. వచ్చేది ఎండాకాలం.. ప్రమాదాలు జరగకముందే అక్కడో స్తంభం వేసి విద్యుత్ తీగలను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు. - టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : బుజ్జి కన్నయ్య,
విద్యుత్ ఏఈ, బొమ్మనపల్లి
సెల్ నంబర్ : 9392388292